# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




ఉమెన్స్ టీమ్ ప్రాబబుల్స్‌కు ఎంపిక

3


| సంపుటి : 01 | సంచిక : 290 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 29 సెప్టెంబర్ 2026 | పేజీలు : 3 |
|---|---|---|---|---|


# చిన్నారి పాదాలు పట్టుకుని..
# ఏమైనా నొప్పిగా ఉందా తల్లి?



2

- అనురాగాన్ని పంచిన కలెక్టర్ సందీప్ కుమార ఝా
- నిబంధనల పరిధి దాటి ప్రజాసేవ అందిస్తున్న ఝా

అది పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల. ఇటీవల సోషల్ మీడియా, వార్తల్లో 'గురుకులంలో విద్యార్థులను ఎలుకలు కరిచాయి' అంటూ ఊహాగానాలు, వదంతులు శరవేగంగా వ్యాపించాయి. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన, అధికారులపై విమర్శలు. ఇలాంటి సమయంలో సాధారణంగా అధికారుల సందర్శన అంటే ఒక పర్యవేక్షణలా, వివరాలు అడిగి తెలుసుకునే ప్రక్రియలా సాగిపోతుంది. కానీ, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యటన మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఓ తండ్రి ప్రేమను, మానవత్వాన్ని చాటి చెప్పింది. విద్యార్థుల పాదాలు పట్టుకుని ఆయన పరిశీలించిన తీరును అందరూ శభాష్ అంటున్నారు. - మన చౌరాస్తా, జనగామ



3 లో

# జనగామలో డీసీసీ భారీ నిరసన


wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలతో, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
మంగళవారం, 29 సెప్టెంబర్ 2026
Mana Chourasta


# చిన్నారి పాదాలు పట్టుకుని.. ఏమైనా నొప్పిగా ఉందా తల్లి?



- అనురాగాన్ని పంచిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నిబంధనల పరిధి దాటి ప్రజా సేవ అందిస్తున్న ఝా

(మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి)



అది పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల. ఇటీవల సోషల్ మీడియా, వార్తల్లో 'గురుకులంలో విద్యార్థులను ఎలుకలు కరిచాయి' అంటూ ఊహాగానాలు, వదంతులు శరవేగంగా వ్యాపించాయి. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన, అధికారులపై విమర్శలు. ఇలాంటి సమయంలో సాధారణంగా అధికారుల సందర్శన అంటే ఒక పర్యవేక్షణలా, కేవలం దస్త్రాలు, వివరాలు అడిగి తెలుసుకునే ప్రక్రియలా సాగిపోతుంది. కానీ, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యటన మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఓ తండ్రి ప్రేమను, మానవత్వాన్ని చాటి చెప్పింది. విద్యార్థుల పాదాలు పట్టుకుని ఆయన పరిశీలించిన తీరును అందరూ శభాష్ అంటున్నారు.

**వదంతుల గుమ్మంలో అనురాగ నిలయం**

పాఠశాలలో అడుగుపెట్టిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దృష్టంతా విద్యార్థినుల సంక్షేమంపైనే ఉంది. ఆర్డీఓ కిరణ్ ప్రకాష్‌తో కలిసి నేరుగా బాలికల వద్దకు వెళ్లిన కలెక్టర్, వారి భయాందోళనలను పటాపంచలు చేసేలా ఆత్మీయంగా ముచ్చటించారు. "ఏమ్మా.. భోజనం బాగుందా? రాత్రి జ్వరం ఏమైనా వచ్చిందా? మీ అమ్మానాన్న పేరేంటి? ఏం పని చేస్తారు?" అంటూ వారి వివరాలు అడుగుతున్న సమయంలో అక్కడ అధికారిక గంభీరత మటుమాయమై, ఓ కుటుంబ పెద్ద పరామర్శిస్తున్న వాతావరణం నెలకొంది.

**చిన్నారి పాదాలను తాకిన ప్రజాధికారం**

వదంతులలో నిజానిజాలు తెలుసుకోవడం కంటే, పిల్లల శరీరంలో ఎక్కడా గాయాలు లేదా నొప్పులు లేవని నిర్ధారించుకోవడమే ఆయన మొదటి ప్రాధాన్యత అయ్యింది. కింద కూర్చుని ఉన్న చిన్నారి విద్యార్థినుల కాళ్లు, చేతులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వయంగా తన చేతుల్లోకి తీసుకుని నిశితంగా పరిశీలించారు. ఒక ఐఏఎస్ అధికారి, జిల్లాకు అత్యున్నత పరిపాలనాధికారి అయిన వ్యక్తి... హోదాలు, ప్రొటోకాల్స్ అన్నీ పక్కనపెట్టి, విద్యార్థినుల కాళ్లను పట్టుకుని "ఇక్కడ ఏమైనా నొప్పిగా ఉందా తల్లి? రక్తం వచ్చిందా?" అని ఆందోళనగా అడుగుతుంటే అక్కడ ఉన్న ఉపాధ్యాయులు, అధికారులు ఆ దృశ్యాన్ని చూసి భావోద్వేగానికి లోనయ్యారు. సమాజంలో హోదా, అధికారం ఎంతోమందికి ఉంటుంది. కానీ, ప్రజాసమస్యల పట్ల, చిన్నారుల భద్రత పట్ల ఇంతటి ఆర్తి, ఆత్మీయత చూపడం అరుదు. కలెక్టర్ చూపిన ఆ స్పర్శలోనే విద్యార్థినులకు "మాకు ఏమీ కాలేదు, మా వెనుక ఒక పెద్ద దిక్కు ఉంది" అనే కొండంత ధైర్యం లభించింది. విద్యార్థినులు కూడా ముద్దుముద్దుగా "మాకు ఏమీ కాలేదు సార్, భోజనం బాగుంది, ఆరోగ్యం బాగుంది" అని నవ్వుతూ సమాధానమిచ్చారు.

**అధికారులకు హెచ్చరిక.. విద్యార్థులకు భరోసా**

పిల్లలకు ఏమీ కాలేదని స్వయంగా నిర్ధారించుకున్న తర్వాత కలెక్టర్ ముఖంలో ఉపశమనం కనిపించింది. వదంతులను నమ్మవద్దని మీడియాకు, ప్రజలకు విజ్ఞప్తి చేసిన ఆయన, అనంతరం పాఠశాల పరిసరాలను తీవ్రంగా పరిశీలించారు. శుభ్రత లోపించడంపై పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేయడం, "విద్యార్థులకు ఫ్రెష్‌గా ఉండే పౌష్టికాహారం అందించాలి, అనుమతి లేకుండా బయటి వ్యక్తులను రానీయకూడదు" అని కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు.

**పరిపాలనకు దక్కిన మానవత్వపు నిలువుటద్దం**

అధికార గర్వాన్ని పక్కనపెట్టి, ఒక చిన్నారి పాదాలను చేతుల్లోకి తీసుకుని ఆమె ఆరోగ్యాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చిత్రం... కేవలం ఒక వార్త కాదు.. ప్రజా పరిపాలనకు దక్కిన మానవత్వపు నిలువుటద్దం. పాలన అంటే కేవలం సంతకాలు, సమీక్షలు మాత్రమే కాదు.. ప్రజల, చిన్నారుల హృదయాలను గెలుచుకోవడమేనని ఆయన మరొకసారి నిరూపించారు.








## పెద్ది వెంకట నారాయణ గౌడ్‌కు సన్మానం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల్లో ఏకగ్రీవంగా వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన పెద్ది వెంకట నారాయణ గౌడ్‌ను భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం హనుమకొండలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఆదరి రవీందర్, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శి గూడెల్లి ధర్మేందర్‌రెడ్డి, పాతపెల్లి సంపత్ యాదవ్, రంగు రాజు, రంగు రవీందర్, నోముల రమేష్, గోపగాని రవి, నారగోని నరేందర్, చిటుకూరి అనిల్‌కుమార్, కాలేరు కిషోర్ తదితరులు పాల్గొన్నారు. తనను సన్మానించిన మండల కాంగ్రెస్ నాయకులకు పెద్ది వెంకట నారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



## జనగామ జిల్లా స్థాయి టైక్వాండో ఛాంపియన్ షిప్ 2026 విజయవంతం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో జిల్లా స్థాయి టైక్వాండో ఛాంపియన్‌షిప్‌ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో జనగామ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి టైక్వాండో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ కిక్స్, పంచింగ్, పూమ్సే మరియు వివిధ పోటీ విభాగాల్లో పోటీపడ్డారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ముఖ్యఅతిథి జనగామ జిల్లా ఎస్సై చెన్నకేశవులు, మరియు డాక్టర్ రాజమౌళి వారు, మరియు జనగామ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు. చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు మరియు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాస్టర్ ఎండి. అబ్బాస్ మాట్లాడుతూ, టైక్వాండో ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం మరియు ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించి, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీలకు వారిని సిద్ధం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, మాస్టర్స్ మెరుగు క్రాంతి, సిహెచ్ అనూష, బానోతు రుద్ర, రిఫరీలు, బానోతు సంతోష్, తదితరులు పాల్గొన్నారు. క్రీడాభిమానులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# సీఈసీ నిర్ణయాలకు వ్యతిరేకంగా జనగామ డీసీసీ భారీ నిరసన

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

**జనగామ, మన చౌరాస్తా :** ఓట్ల చోరీ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు జనగామలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బిజెపి పార్టీకి కీలుబొమ్మగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని నెహ్రూ పార్క్ నుండి జనగామ కలెక్టరేట్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. సీఈసీకి వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, జనగామ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, వైటీడీఏ (YTDA) మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్తన్న, వైస్ చైర్మన్ కంచె రాములు, జనగామ మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ హాజరై నిరసనలో పాల్గొన్నారు. అలాగే, డీసీసీ అధికార ప్రతినిధి డా. నరేందర్ పవార్, డీసీసీ ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి, సేవాదళ్ విభాగ అధ్యక్షులు జాయ మల్లేష్, మైనారిటీ విభాగం అధ్యక్షులు మజీద్ అఫ్సర్, బీసీ విభాగం అధ్యక్షులు ప్రవీణ్, మల్లేష్, పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎస్సీ విభాగం నాయకులు, ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు రామ్ చందర్, రాజు, సోమన్నలతో పాటు పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల ముఖ్య నాయకులు, జిల్లా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేశారు.









## ఉమెన్స్ టీమ్ ప్రాబబుల్స్‌కు ఎంపిక



**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని శ్రీధర్ క్రికెట్ క్లబ్ లో శిక్షణ పొందుతున్న ఆకుల జాహ్నవి తన ప్రతిభను చాటుకుంది. వరంగల్‌లో ఆగస్టు 27న హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్15 ఉమెన్స్ ఓపెన్ ట్రయల్స్ లో జాహ్నవి అద్భుత ప్రతిభ కనబరిచి, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి హెచ్‌సీఏ అండర్15 ఉమెన్స్ టీమ్ ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా క్రికెట్ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్, కోచ్‌లు మరియు తోటి క్రీడాకారులు జాహ్నవిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రైతు సంక్షేమ పథకాలకు రూ.13.13 కోట్లు

- సొసైటీ సభ్యులకు రూ.3 కోట్ల బోనస్
- 70వ వార్షిక మహాసభలో కీలక నిర్ణయాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** రైతు సంక్షేమమే లక్ష్యంగా ముల్కనూర్ సహకార సంఘం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని సంఘం అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది రైతు సంక్షేమ పథకాల కోసం రూ.13.13 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని సంఘ ప్రధాన కార్యాలయంలో 70వ వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకేవీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రుణాల నిర్వాహకుడు రాజమౌళి వార్షిక నివేదికను సభకు వివరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. మహాసభకు సుమారు 6 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. సంఘం ఈ ఏడాది రూ.426 కోట్ల వ్యాపారం నిర్వహించగా రూ.7.22 కోట్ల లాభం ఆర్జించిందన్నారు. రైతులకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలుగా రూ.250 కోట్లు అందించినట్లు తెలిపారు.

**రైతులకు రుణమాఫీ.. పించన్లు**

రైతుల కోసం ఇప్పటివరకు సుమారు 3 వేల మందికి రూ.12 కోట్ల పంట రుణమాఫీ చేసినట్లు ప్రవీణ్ రెడ్డి తెలిపారు. 800 మంది రైతులకు పింఛన్ల రూపంలో రూ.3 కోట్ల వరకు అందించినట్లు చెప్పారు. సభ్యుల పిల్లల ఉన్నత విద్య కోసం రూ.16 లక్షల వరకు విద్యా సహాయం అందించామన్నారు. గత 20 ఏళ్లుగా 3,514 మంది రైతులకు కంటి శస్త్రచికిత్సల కోసం రూ.2.10 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

**విత్తనోత్పత్తిలో ప్రత్యేక గుర్తింపు**

ముల్కనూర్ విత్తన సంస్థ ద్వారా తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రైతుల అవసరాలకు అనుగుణంగా రూ.47 కోట్ల విలువైన విత్తనోత్పత్తి చేపట్టినట్లు తెలిపారు. వివిధ రకాల వరి ధాన్యం కొనుగోళ్ల ద్వారా రైతులకు రూ.3 కోట్లను బోనస్‌గా వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

**రుణ పరిమితి పెంపు**

సభ్యుల దహన సంస్కారాల సహాయాన్ని రూ.5 వేలకు పెంచుతూ, మొత్తంగా క్వింటా బియ్యం అందించేలా తీర్మానం చేసినట్లు తెలిపారు. పంట రుణ పరిమితిని రూ.46 వేల నుంచి రూ.50 వేలకు పెంచినట్లు వెల్లడించారు. రైతులు పండించే పంటలకు మెరుగైన ధరలు, సేవలు అందించేందుకు గ్రామీణ స్మార్ట్ కేంద్రం ద్వారా భూసార పరీక్షలు, ఉపగ్రహ ఆధారిత పంట పర్యవేక్షణ, డ్రోన్ మందుల పిచికారీ వంటి సేవలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.పంట ఉత్పత్తుల విక్రయాల ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా భారతీయ బీజ సహకార సమితితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రవీణ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన నిర్వాహకుడు మారుపాటి రామ్‌రెడ్డి, సహాయ ప్రధాన నిర్వాహకుడు ఓలాద్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచిత బూట్లు, సాక్స్ పంపిణీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బూట్లు, సాక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, మండల విద్యాశాఖ అధికారి శంకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి విద్యార్థులకు బూట్లు, సాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలస్వామి, ఉపాధ్యాయులు జ్యోతి, భవాని తదితరులు పాల్గొన్నారు.